# పోలీస్ జాగిలం ట్యాంగో మృతి

పోలీస్ జాగిలానికి పూల మాల వేసి నివాళులర్పిస్తున్న ఎస్పీ అఖిల్ మహాజన్

సిరిసిల్ల రూరల్, జూలై 13: సిరిసిల్ల జిల్లా పోలీసు హెడ్ క్వార్టర్స్‌లోని జాగిలం ట్యాంగో అనారోగ్యంతో శనివారం మృతి చెందింది. జర్మన్ షెఫర్డ్ సంతతికి చెందిన ఈ జాగిలం ఎనిమిదేళ్లుగా జిల్లాలో విధులు నిర్వహిస్తున్నది. 2017లో హ్యాండ్లర్ లక్ష్మణ్‌తోపాటు ఎనిమిది నెలలుగా ఐఐటీఏ మోయినాబాద్‌లో బేసిక్ ట్రైనింగ్ పూర్తి చేసుకోగా జిల్లాకు కేటాయించగా, 15 హత్యలు, 84 దొంగతనాల కేసుల్లో నిందితులను గుర్తించడంలో ట్యాంగో చాకచక్యంగా వ్యవహరించింది. మృతి చెందిన ట్యాంగోకు హ్యాండ్లర్ లక్ష్మణ్‌తో కలిసి ఎస్పీ అఖిల్ మహాజన్ పూలమాల వేసి నివాళులర్పించారు. ట్యాంగో సేవలను మరువలేనివని కొనియాడారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ చంద్రయ్య, ఆర్ఐలు యాదగిరి, ముధుకర్, రమేశ్, రాజా హ్యాండ్లర్ లక్ష్మణ్, డాగ్ స్క్వాడ్, పోలీసు సిబ్బంది ఉన్నారు.

# బిడ్డ పెళ్లి కావడం లేదని..

భూక్యాతండాలో తల్లి ఆత్మహత్య

సరోజన(ఫైల్)

వీర్నపల్లి, జూలై13 : బిడ్డకు పెళ్లి కావడం లేదని ఓ తల్లి మనస్తాపం చెంది, ఆత్మహత్య చేసుకున్నది. పోలీసుల వివరాల ప్రకారం.. వీర్నపల్లి మండలం భూక్యతండాకు చెందిన భూక్య సరోజన(62)కు ముగ్గురు కూతుళ్లు ఉన్నారు. సరోజన భర్త పీర్యా 30 ఏండ్ల కిందట మరణించాడు. అప్పటి నుంచి కూలీ పని చేస్తూ కూతుళ్లతో జీవనం సాగించింది. కొంత అప్పు చేసి ఇద్దరు కూతుళ్ల పెళ్లి చేసింది. చిన్న కూతురుకు పెళ్లి కుదరకపోవడం, ఆర్థిక ఇబ్బందులు పెరిగిపోతుండడం, తాను అనారోగ్య సమస్యలతో సతమతకావడంతో మనస్తాపం చెందింది. శుక్రవారం ఎలుకల మందు తాగింది. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స కోసం ఎల్లారెడ్డిపేటలోని ఓ ప్రైవేట్ దవాఖానకు తరలించగా, పరిస్థితి విషమించి శనివారం మృతిచెందింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఎల్లాగౌడ్ తెలిపారు.

# మిషన్ భగీరథపై నిర్లక్ష్యం

ఎలిగేడు, జూలై 13: బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అప్పటి సీఎం కేసీఆర్ అత్యంత ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టి ప్రారంభించిన 'మిషన్ భగీరథ' పథకంపై నిర్లక్ష్యం చూపుతున్నారు. ఈ పథకం ద్వారా స్వచ్ఛమైన తాగు నీరు ప్రజలకు సమయానికి అందించకపోగా, నిర్వహణ లోపంతో పైపులు పగిలిపోయి నీరంతా వృథాగా పోతున్నది. ఎలిగేడు పెట్రోల్ బంక్‌కు చౌరస్తాలో శనివారం ఈ సమస్య వెలుగు చూసింది. ప్రతి రోజు సాయంత్రం మిషన్ భగీరథ తాగునీటి కోసం మండల ప్రజలు చూస్తుంటారు. కాని ఆ పనులను చూసే ఏ ఒక్కరూ పట్టించుకున్న పాపాన పోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. కేసీఆర్ పేరును బద్నాం చేసేందుకు నాయకులు వారి ఇష్టానుసారంగా వ్యవహరిస్తూ తాగునీటి సరఫరా గురించి పట్టించుకోవడం లేదని ప్రజలు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా గ్రామీణ ప్రాంతాల్లో ఈ పథకం ద్వారా ప్రజలకు సక్రమంగా తాగునీరు అందించే ఏర్పాట్లలో అంతరాయం లేకుండా చూడాలని, నాసిరకం పనులు చేసిన కాంట్రాక్టర్లపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ఇసుకను డంప్ చేస్తున్న యంత్రం

# అనుమతుల పేరిట అక్రమ తవ్వకాలు!

- కొత్తపల్లి ఇసుక క్వారీలో ఇష్టారాజ్యం
- అడ్డుకున్న రేణికుంట రైతులు, యువకులు

తిమ్మాపూర్, జూలై13: కొత్తపల్లి ఇసుక క్వారీలో ఇసుక అక్రమంగా తరలిపోతున్నది. అనుమతుల పేరిట నిర్వాహకులు మోయతుమ్మెద వాగులో ఎడాపెడా తవ్వేస్తుండగా, శనివారం రేణికుంట గ్రామస్తులు మూకుమ్మడిగా వెళ్లి అడ్డుకున్నారు. కొత్తపల్లి, రేణికుంట గ్రామాల మధ్య ఉన్న మోయతుమ్మెద వాగులో రెండు గ్రామాలకు సగ భాగం హక్కు ఉంటుంది. అయితే ప్రభుత్వం కొన్నేళ్లుగా కొత్తపల్లి శివారున ఇసుక తవ్వకాలు చేసుకోవడానికి ప్రైవేట్ సంస్థలకు అనుమతులు ఇస్తున్నది. ఈ సంవత్సరం కొత్తపల్లి భాగంలో ఇసుకను తవ్వాల్సి ఉండగా, సదరు క్వారీ నిర్వహకులు కొద్ది రోజుల నుంచి రేణికుంట భాగానికి వెళ్లి తవ్వుతున్నారని, ప్రభుత్వం ఇచ్చిన వైశాల్యం కంటే పరిమితికి మించి తోడేస్తున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. నిబంధనలు పాటించకుండా లోతుగా తవ్వేస్తుండడంతో గ్రామానికి మంచినీటిని అందించే బావితోపాటు పలువురు రైతుల బావులు, బోర్లు, పైప్‌లైన్లు దెబ్బతింటున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదే గాక వాగు ఒడ్డున ఉన్న మట్టిని అక్రమంగా తవ్వి దారులు పోయడంతో పొలాల గట్లు దెబ్బతిన్నాయని మండిపడుతున్నారు. అనంతరం తహసీల్దార్ కనుకయ్యకు వినతిపత్రం అందజేసేందుకు వెళ్లారు. అధికారులు స్పందించి క్వారీలో జరుగుతున్న అక్రమ తవ్వకాలను అడ్డుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు. తవ్వకాల గడువు సైతం మించిపోయిందని, అయినా ప్రభుత్వ పెద్దల అండతో క్వారీ యాజమాన్యం రెచ్చిపోతోందని.. అధికారులు ఇప్పటికైనా స్పందించాలని కోరుతున్నామన్నారు.

తవ్వకాలను అడ్డుకున్న రేణికుంట రైతులు, యువకులు

### అడిగితే బెదిరిస్తున్నరు

క్వారీలో అక్రమంగా ఇసుక తీస్తున్నరు. లోతుగా తీయడంతో ఒడ్డున ఉన్న తాడిచెట్లు, గట్లు పాడైతున్నయి. పొలాలు కరాబైతున్నయి. ఇక్కడ చేతిబోర్లు, బావులతోని రెండు వందల ఎకరాలు పారుతయి. లోతుగా తవ్వడంతో నీరు కూడా అందుతలేదు. అడిగితే ఎవ్వలకు చెప్పుకుంటవో చెప్పుకపో అని బెదిరిస్తున్నరు. దయచేసి అధికారులు ఈ తవ్వకాలను ఆపాలె.

-కొర్రి వంశీ, రేణికుంట

### పొలాలకు నష్టం

ఇసుకను ఇష్టం వచ్చినట్లు తవ్వుతున్నరు. రాత్రి తరలించుకపోతున్నరు. లోతు తవ్వడం వల్ల నీళ్లు అడుగంటి పొలాలు తడారుతున్నయి. మళ్లీ వాగు పొంగినప్పుడు పొలాలు మడులు కోతకు గురై తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నం. ఈ ఇసుక క్వారీ చేయవట్టి మాకు అన్యాయం జరుగుతున్నది. అధికారులు స్పందించాలి.

- శ్రీను, రేణికుంట

### రాత్రి ఎత్తుకపోతున్నరు

మా పొలం పక్కదాక ఇసుక తీయడంతోని పైపు లైన్లు కరాబైనయి. వద్దని చెప్పినా వింటలేరు. పొద్దంతా కావలి ఉండి అడ్డుకుంటే దొంగ రాత్రి వచ్చి ఎత్తుకుని పోతున్నరు. వీళ్ల చేష్టలతోని నష్టం ఐతంది. ఇవ్వారకే ఒర్రె పడి మడి కోతపడి పది గుంటలక చ్చింది. మొత్తం లోపలిదాక అచ్చి తీయడంతోని నేను మస్తు నష్టపోయిన. సార్లు వచ్చి చూసి న్యాయం చేయాలే.

- రాయమల్లు, రైతు (రేణికుంట)

# 84 సింగరేణి క్వార్టర్లకు కరెంట్ కట్

- చీకట్లో కార్మిక కుటుంబాలు
- అభివృద్ధి పేరిట విధ్వంసం
- సర్వత్రా విమర్శలు

నివాస క్వార్టర్‌లో షేషెంట్

గోదావరిఖని, జూలై 13 : గోదావరిఖనిలో అభివృద్ధి పేరుతో అధికారులు విధ్వంసం సృష్టిస్తున్నారు. ఖని చౌరస్తా సమీపంలోని శివాజీనగర్, ఓల్డ్ అశోక్ టాకీస్‌ల వద్ద ఉన్న సింగరేణి క్వార్టర్లను కూల్చి రోడ్లు వెడల్పు చేయాలని ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాగూర్ నిర్ణయం తీసుకొని అమలు చేస్తుండడంతో కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గతంలోనే ఈ క్వార్టర్లకు యాజమాన్యం నోటీసులు జారీ చేయగా, ఈ పరంపరంలోనే శనివారం విద్యుత్ సరఫరా నిలిపేసింది. దీంతో కార్మిక కుటుంబాలు చీకట్లోనే ఉండాల్సిన దుస్థితి ఏర్పడింది. 84 సింగరేణి క్వార్టర్లకు విద్యుత్ సరఫరా నిలిపివేయవద్దని ఎంత విజ్ఞప్తి చేసినా వినకుండా నిలిపివేయడంతో కార్మికులు తీవ్ర ఆగ్రహానికి గురయ్యారు. కరెంటు కట్ చేసిన క్వార్టర్లలో షేషెంట్లు ఉండడంతో వారు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. పిల్లలు దీపం వెలుగులో చదువులు కొనసాగించారు. అభివృద్ధి విషయంలో రామగుండం ఎమ్మెల్యే అన్ని వర్గాలతో మాట్లాడి నిర్ణయం తీసుకోవాలని, తన ఇష్టానుసారంగా, అవసరం లేకున్నా రోడ్డును అనుకోని ఉన్న రెండు, మూడు క్వార్టర్లను కూల్చవద్దని ప్రతిపక్షాల నాయకులు, ప్రజలు కోరితే ఆయన మాత్రం ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని విమర్శలు వస్తున్నాయి. ఒకే వైపు 100 నుంచి 200 ఫీట్ల వరకు క్వార్టర్‌లను తొలగించి వెడల్పు చేయాలని నిర్ణయించడం సరైందికాదని ఆరోపణలు వస్తున్నాయి.

### విధ్వంసం సరికాదు : బీఆర్ఎస్ నేత కౌశికహరి

అభివృద్ధి పేరిట విధ్వంసం సృష్టించడం సరికాదని బీఆర్ఎస్ నేత కౌశికహరి విమర్శించారు. సింగరేణి క్వార్టర్లకు విద్యుత్ సరఫరా నిలిపివేయగా, అక్కడికి చేరుకొని అడ్డుకునేందుకు ప్రయత్నించారు. అయితే, విఫలం కావడంతో ఆయన నేరుగా సింగరేణి ఆర్జీ-1 జీఎం కార్యాలయానికి జీఎంను కలవడానికి వెళ్లగా ఆయన అందుబాటులో లేరు. దీంతో సింగరేణి సంస్థ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ బలరాం దృష్టికి ఫోన్ ద్వారా తీసుకువెళ్లారు. ఈసందర్భంగా కౌశికహరి 'నమస్తే తెలంగాణ'తో మాట్లాడారు. అభివృద్ధి పేరుతో విధ్వంసం సృష్టించడం ఏంటని ప్రశ్నించారు. రోడ్డు వెడల్పునకు సంబంధించి ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ అన్ని వర్గాలతో చర్చించి నిర్ణయం తీసుకోవాల్సి ఉండగా అవేమీ పట్టించుకోకుండా ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకుంటూ కార్మికులను ఇబ్బందుల పాలు చేస్తున్నారని విమర్శించారు. ఇప్పటికైనా అభివృద్ధి విషయంలో రోడ్డు వెడల్పునకు సంబంధించి ఎంత స్థలం అవసరం ఉంటుంది అనే విషయంలో అన్ని వర్గాలను సంప్రదించాలని డిమాండ్ చేశారు. విద్యుత్ సరఫరా నిలిపివేసిన క్వార్టర్లకు వెంటనే పునరుద్ధరించాలని కోరారు.

# పున్నం చందర్‌కు ఇన్‌స్పైరింగ్ సైకాలజిస్ట్ అవార్డు

కేంద్ర మాజీ మంత్రి చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న పున్నం చందర్

రాజన్న సిరిసిల్ల, జూలై 13 (నమస్తే తెలంగాణ) : ప్రముఖ సైకాలజిస్ట్ కనుకుంట్ల పున్నంచందర్‌కు ఇన్‌స్పైరింగ్ సైకాలజిస్ట్ అవార్డు లభించింది. సిరిసిల్ల నేతన్నల ఆత్మహత్యలను నివారించేందుకు పదిహేనేళ్ల కిందట అప్పటి ప్రభుత్వం ఆయనను నియమించగా.. అప్పటి నుంచి మానసిక సమస్యలు, మత్తు పదార్థాలు, ఆత్మహత్యలు నిరోధంపై విశేష కృషిచేస్తున్నారు. చేనేత, మరమగ్గాల కార్మికులకు సామూహిక కౌన్సెలింగ్ నిర్వహిస్తూ ఆత్మహత్యల నివారణకు ఆయన చేస్తున్న సేవలను గుర్తించిన తెలంగాణ సైకాలజిస్టు అసోసియేషన్ ఇన్‌స్పైరింగ్ సైకాలజిస్టు అవార్డుకు ఎంపిక చేసింది. ఈ మేరకు హైదరాబాద్‌లోని బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో శనివారం నిర్వహించిన అవార్డుల ప్రదానోత్సవానికి కేంద్రమాజీ మంత్రి ఎస్ వేణుగోపాలచారి, మాజీ మంత్రి త్రిపురాణ వెంకటరత్నం, సినీనటుడు ప్రదీప్ హాజరవగా, పున్నం చందర్ ఈ అవార్డును అందుకున్నారు. ఆయనకు అవార్డు రావడంపై పోపా ప్రతినిధులు వాసాల హరిప్రసాద్, అలువాల ఈశ్వర్, ఆడెపు వేణు, ఎలగొండ ఆంజనేయులు, అరవింద్, అయ్యప్ప రాములు హర్షం వ్యక్తం చేశారు.

## వాణిజ్య



### డీ-మార్ట్ లాభం 774 కోట్లు

న్యూఢిల్లీ, జూలై 13: డీ-మార్ట్ పేరుతో రిటైల్ అవుట్‌లెట్లను నిర్వహిస్తున్న అవెన్యూ సూపర్‌మార్ట్స్ లిమిటెడ్ ఆశాజనక ఆర్థిక ఫలితాలు ప్రకటించింది. జూన్‌తో ముగిసిన మూడు నెలల కాలానికిగాను సంస్థ రూ.773.68 కోట్ల కన్సాలిడేటెడ్ నికర లాభాన్ని గడించింది. అమ్మకాలు పెరగడం వల్లనే గతేడాది ఇదే త్రైమాసికంలో నమోదైన రూ.658.71 కోట్ల లాభంతో పోలిస్తే 17.45 శాతం వృద్ధిని కనబరిచింది. సమీక్షకాలంలో కంపెనీ ఆదాయం ఏడాది ప్రాతిపదికన 18.57 శాతం ఎగబాకి రూ.11,865.44 కోట్ల నుంచి రూ.14,069.14 కోట్లకు చేరుకున్నది. నిర్వహణ ఖర్చులు 18.62 శాతం పెరిగి రూ.13,056.61 కోట్లకు చేరాయి. ఈ సందర్భంగా అవెన్యూ సూపర్‌మార్ట్స్ సీఈవో, ఎండీ నెవిల్లి నోరోన్హా మాట్లాడుతూ..గత త్రైమాసికంలో కొత్తగా ఆరు స్టోర్లను ప్రారంభించడంతో మొత్తం సంఖ్య 371కి చేరుకున్నాయన్నారు.

### 5.74 లక్షల కోట్లకు ప్రత్యక్ష పన్ను వసూళ్లు

న్యూఢిల్లీ, జూలై 13: ప్రత్యక్ష పన్ను వసూళ్లలో రెండంకెల వృద్ధి నమోదైంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఇప్పటి వరకు ప్రత్యక్ష పన్ను వసూళ్లలో 19.54 శాతం పెరిగి రూ.5.74 లక్షల కోట్లు వసూలైనట్లు కేంద్ర ప్రత్యక్ష పన్నుల బోర్డు(సీబీడీటీ) వెల్లడించింది. కార్పొరేట్ సంస్థలు అధికంగా అడ్వాన్స్ ట్యాక్స్ చెల్లింపులు జరపడం ఇందుకు కారణమని తెలిపింది. అడ్వాన్స్ ట్యాక్స్ వసూళ్లు 27.34 శాతం ఎగబాకి రూ.1.48 లక్షల కోట్లకు చేరాయి. దీంట్లో కార్పొరేషన్ ఆదాయ పన్ను(సీఐటీ) వసూళ్లు 1.14 లక్షల కోట్లు కాగా, వ్యక్తిగత ఆదాయ పన్ను (పీఐటీ) రూ.34,470 కోట్లని పేర్కొంది. ఈ నెల 11 నాటికి నికర ప్రత్యక్ష పన్ను వసూళ్లు రూ.5,74,357 కోట్లు కాగా, వీటిలో సీఐటీ రూ.2,10,274 కోట్లు, పీఐటీ రూ.3,46,036 కోట్లని తెలిపింది. అలాగే రూ.70,902 కోట్లను రిఫండ్ రూపంలో చెల్లించింది.

# లైఫ్ సైన్సెస్ పాలసీ ఎప్పుడో?

4 నెలలు దాటినా ఊసేలేని కొత్త విధానం

లైఫ్ సైన్సెస్ గ్రిడ్ స్ట్రాటజీపై తీవ్ర నిర్లక్ష్యం

ఫార్మా విలేజ్‌ల ఏర్పాటుకు భూముల కొరత

హైదరాబాద్, జూలై 13 (నమస్తే తెలంగాణ): దేశ ఔషధ రాజధానిగా హైదరాబాద్‌కు ఉన్న ఖ్యాతి రాష్ట్ర ప్రభుత్వ ఉదాశీనత వల్ల మసకబారే అవకాశాలు కనిపిస్తున్నాయి. రాష్ట్రంలో ఫార్మా రంగాన్ని మరింత అభివృద్ధి చేస్తామని ప్రగల్భాలు పలుకుతున్న రాష్ట్ర ప్రభుత్వం.. చేతల్లో మాత్రం ఏమీ చేయలేకపోతున్నది. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం సిద్ధం చేసిన ఫార్మాసిటీని రద్దు చేసి, 3 చోట్ల ఫార్మా విలేజ్‌లను నెలకొల్పుతామని రేవంత్ సర్కారు ప్రకటించినప్పటికీ వాటి జాడ ఎక్కడా కానరావడం లేదు. లైఫ్ సైన్సెస్ పాలసీని ప్రవేశపెడతామని ప్రకటించి 4 నెలలు దాటినా ఇంతవరకు దాని ఊసే లేదు. కనీసం ఆ దిశగా కసరత్తు జరుగుతున్న దాఖలాలు కూడా లేవు. ఈ నెల 5న హైదరాబాద్‌లో ప్రారంభమైన ఇండియన్ ఫార్మాస్యూటికల్ కాంగ్రెస్‌లో ఈ పాలసీని విడుదల చేస్తారని అందరూ భావించినప్పటికీ నిరాశే ఎదురైంది. ప్రస్తుతం ఆ పాలసీపై మాట్లాడేందుకు అధికారులు నిరాకరిస్తున్నారు. తమకు ఎలాంటి సమాచారం లేదని చెప్తున్నారు. వాస్తవానికి ఫార్మా రంగంలో హైదరాబాద్‌కు ఎన్నో అనుకూలతలు ఉన్నాయి. వాటికి తోడుగా గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం అభివృద్ధి చేసిన ఎకోసిస్టంవల్ల పెద్ద ఎత్తున పెట్టుబడులు వస్తున్నాయి. అనేక ఆర్‌అండ్‌డీ కేంద్రాలు ఏర్పాటవుతున్నాయి. ఈ నేపథ్యంలో రాష్ట్రానికి లైఫ్ సైన్సెస్ రంగంలో మరింత ఉజ్వల భవిష్యత్తు ఉండనడంలో ఎలాంటి సందేహం లేదు. కానీ, రేవంత్ ప్రభుత్వం నుంచి ఈ రంగానికి ఆశించిన స్థాయిలో ప్రోత్సాహం అందడంలేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

### గ్రిడ్ స్ట్రాటజీపై నిర్లక్ష్యం

గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్రాన్ని లైఫ్ సైన్సెస్ హబ్‌గా తీర్చిదిద్దాలని సంకల్పించింది. రానున్న పదేండ్లలో లైఫ్ సైన్సెస్ ఎకోసిస్టంను 100 బిలియన్ డాలర్ల స్థాయికి పెంచాలని, తద్వారా 4 లక్షల ఉద్యోగాలు కల్పించాలని నిర్ణయించింది. దీనిలో భాగంగా లైఫ్ సైన్సెస్ గ్రిడ్ స్ట్రాటజీని ప్రకటించింది. కానీ, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం దీన్ని కూడా నిర్లక్ష్యం చేస్తున్నది. రాష్ట్రంలో 10 గ్రీన్‌ఫీల్డ్ ఫార్మా విలేజ్‌లను ఏర్పాటు చేస్తామని ప్రకటించిన సీఎం రేవంత్.. తొలుత నల్లగొండ, మెదక్, వికారాబాద్‌లో సుమారు 1000 నుంచి 2000 ఎకరాల విస్తీర్ణంలో వీటిని ఏర్పాటు చేస్తామని చెప్పారు. ఇది జరిగి 4 నెలలు దాటినా ఎలాంటి పురోగతి లేదు. క్షేత్ర స్థాయిలో మాత్రం భూముల కొరత వెంటాడుతున్నది. నల్లగొండ, మెదక్‌లో భూములు లేవని కలెక్టర్లు స్పష్టం చేయడంతో వికారాబాద్, జహీరాబాద్‌లో ల్యాండ్ పూలింగ్ విధానంలో ఫార్మా విలేజ్‌లు ఏర్పాటు చేసేందుకు అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారు. గతంలో ప్రభుత్వం హైదరాబాద్ శివార్లలో ఫార్మాసిటీని అభివృద్ధి చేసేందుకు దాదాపు 13 వేల ఎకరాలు సేకరించింది. దీనికి కేంద్రం నుంచి పర్యావరణ అనుమతులు కూడా రావడంతో భూముల కోసం అనేక కంపెనీలు దరఖాస్తు చేసుకున్నాయి. కానీ, కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఫార్మాసిటీని రద్దు చేయడం, కొత్త ఫార్మా విలేజ్‌లు ఇంకా కార్యరూపం దాల్చకపోవడంతో పరిశ్రమ వర్గాలు అయోమయ పరిస్థితిలో కొట్టుమిట్టాడుతున్నాయి.




టీ కన్సల్ట్‌ను ప్రారంభిస్తున్న కంపెనీ సీఈవో సందీప్ మక్తల తదితరులు

# టీజీఐపీని ప్రారంభించిన టీ కన్సల్ట్

హైదరాబాద్ సిటీబ్యూరో, జూలై 13 (నమస్తే తెలంగాణ): తెలుగు స్టార్టప్‌లకు అంతర్జాతీయ స్థాయిలో అవకాశాలు అందించడమే లక్ష్యంగా ఏర్పాటైన టీ కన్సల్ట్.. తొలి సారిగా గ్లోబల్ ఇన్వెస్టర్ పూల్‌ను ప్రారంభించింది. ఈ విషయాన్ని కంపెనీ సీఈవో సందీప్ మక్తల తెలిపారు. దుబాయ్ వ్యాపారవేత్త బూ అబ్దుల్లాతో ఒప్పందాన్ని కుదుర్చుకున్నట్లు, తద్వారా మన వ్యాపారాలకు అంతర్జాతీయ స్థాయిలో అవకాశాలను అందిపుచ్చుకోవడానికి వీలుంటుందన్నారు. అంతర్జాతీయ స్థాయిలో పేరొందిన అబ్దుల్లా కంపెనీతో టీ కన్సల్ట్ ఒప్పందం కుదుర్చుకోవడం ద్వారా ఎంతో మేలు చేయనున్నదని, ముఖ్యంగా ఆవిష్కరణ రంగంలో ప్రత్యేక నైపుణ్యతను కలిగివున్న తెలుగు వారికి అంతర్జాతీయ అవకాశాలను సొంతం చేసుకునేందుకు ఇది మంచి వేదికని సందీప్ మక్తల తెలిపారు.

# బీఎస్ఎన్ఎల్-ఎంటీఎన్ఎల్ విలీనం లేనట్టే!

న్యూఢిల్లీ, జూలై 13: ప్రభుత్వరంగ టెలికం సంస్థలైన బీఎస్ఎన్ఎల్, ఎంటీఎన్ఎల్‌లను విలీనం చేసే ప్రతిపాదనను కేంద్ర ప్రభుత్వం వెనక్కి తీసుకున్నట్లు తెలుస్తున్నది. కేవలం మహానగర్ టెలిఫోన్ నిగం లిమిటెడ్(ఎంటీఎన్ఎల్)కి చెందిన కార్యకలాపాలను బీఎస్ఎన్ఎన్‌కు అప్పగించేయోచనలో సర్కార్ ఆ దిశగా చర్యలు తీసుకుంటున్నట్లు ప్రభుత్వ వర్గాల ద్వారా తెలుస్తున్నది. ప్రస్తుతం ఆ దిశగా చర్యలు జరుగుతున్నాయని, దీనికి మరో నెల రోజులు సమయం పట్టే అవకాశాలున్నాయని పేర్కొన్నారు. అప్పుల ఊబిలో కొట్టుమిట్టాడుతున్న ఎంటీఎన్ఎల్‌ను బీఎస్ఎన్ఎల్‌లో విలీనం చేయడం ఎంతమాత్రం సమంజసం కాదని ఆ వర్గాలు భావిస్తుండటం వల్లనే కార్యకలాపాలు మాత్రమే మార్చాలని యోచిస్తున్నది. తొలుత సెక్రటరీల కమిటీ ఈ ప్రతిపాదనను ఉంచిన తర్వాత క్యాబినెట్ ఆమోదానికి పంపిస్తారని సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. ఈ నెల 20న ఎంటీఎన్ఎల్ బాండ్ల ద్వారా సేకరించిన నిధులకు వడ్డీలను చెల్లించాల్సి ఉన్నది. ప్రస్తుతం ఎంటీఎన్ఎల్..ఢిల్లీ, ముంబైలలో మాత్రమే టెలికం సేవలు అందిస్తుండగా, బీఎస్ఎన్ఎల్ మిగతా దేశవ్యాప్తంగా అందిస్తున్నది. గడిచిన ఆర్థిక సంవత్సరంలో ఎంటీఎన్ఎల్ రూ.3,267.5 కోట్ల నష్టం వచ్చింది.

# నయా కార్లు వచ్చేస్తున్నాయ్..



న్యూఢిల్లీ, జూలై 13: కొనుగోలుదారులను ఆకట్టుకోవడానికి దేశీయ ఆటోమొబైల్ దిగ్గజాలు నయా మాడళ్లను అందుబాటులోకి తీసుకోస్తున్నాయి. ప్రస్తుత నెలలో కూడా సరికొత్త మాడళ్లను ప్రవేశపెట్టబోతున్నాయి. వీటిలో టాటా, నిస్సాన్, హ్యుందాయ్, మెర్సిడెజ్, బీఎండబ్ల్యూ వంటి అరడజన్‌కు పైగా సంస్థలు తమ కొత్త మాడళ్లను విడుదల చేయబోతున్నాయి. దీంట్లో ప్రీమియం సెడాన్, లగ్జరీ హ్యాచ్‌బ్యాక్, పలు ఎస్‌యూవీలతోపాటు ఎలక్ట్రిక్ కార్లు కూడా ఉన్నాయి. వీటి వివరాలు..

### టాటా కర్వ్ ఈవీ

టాటా మోటర్స్ ఈవీల పరిధిని మరింత విస్తరించడంలో భాగం మరో మాడల్‌ను విడుదల చేయడానికి రెడీ అయ్యింది. టాటా కర్వ్ ఈవీ పేరుతో విడుదల చేయనున్న ఈ మాడల్ సింగిల్ చార్జింగ్‌తో 500 కిలోమీటర్ల వరకు మైలేజీ ఇవ్వనన్నది. ఈ కారు ధర రూ.20 లక్షల కంటే అధికంగా ఉంటుందని అంచనా. 12.3 అంగుళాల టచ్‌స్క్రీన్, 10.25 అంగుళాల డిజిటల్ డ్రైవర్ డిస్‌ప్లే, అడ్వాన్స్‌డ్ డ్రైవర్ అసిస్టెన్స్ సిస్టమ్ వంటి ఫీచర్స్‌తో తీర్చిదిద్దింది. ఈ మాడల్‌నే ఈ నెల చివర్లో అందుబాటులోకి తీసుకురావాలని చూస్తున్నది.

### నిస్సాన్ ఎక్స్-ట్రెల్

దేశీయ మార్కెట్లోకి అడుగుపెట్టి దశాబ్దకాలం పూర్తైన సందర్భంగా నిస్సాన్..ఫోర్త్ జనరేషన్ అవతార్ మాడల్‌ను ప్రవేశపెట్టడానికి సిద్ధమైంది. ప్రీమియం టచ్ ఇన్‌సైడ్, 12.3 అంగుళాల టచ్‌స్క్రీన్, అడాస్, 1.5 లీటర్ టర్బో పెట్రోల్ ఇంజిన్, 8 స్పీడ్ సీవీటీ ఆటోమేటిక్‌గా ఈ మాడల్‌ను రూపొందించింది.

### హ్యుందాయ్ అల్కాజర్ నయా..

అల్కాజర్‌లో నయా మాడల్‌ను మార్కెట్లోకి విడుదల చేయడానికి సిద్ధమైంది హ్యుందాయ్ మోటర్. ఈ నెల చివర్లో అందుబాటులోకి రానున్న ఈ కారు ధర రూ.17 లక్షల స్థాయిలో ఉంటుందని అంచనా. పెట్రోల్, డీజిల్ ఇంజిన్‌తో తయారైన ఈ మాడల్‌లో 10.25 ఇంచుల స్క్రీన్, డ్యూయల్-జోన్ క్లైమెట్ కంట్రోల్, వైర్‌లెస్ ఫోన్ చార్జర్, ఏడు ఎయిర్ బ్యాగ్‌లు వంటి ఫీచర్స్ ఉన్నాయి.

### బీఎండబ్ల్యూ 5 సిరీస్

జర్మనీకి చెందిన లగ్జరీ కార్ల తయారీ సంస్థ బీఎండబ్ల్యూ.. ఎనిమిదో జనరేషన్ 5 సిరీస్ మాడళ్లను మార్కెట్లోకి విడుదల చేయబోతున్నట్లు ప్రకటించింది. ఇప్పటికే ఈ మాడళ్లు అంతర్జాతీయ మార్కెట్లో లభ్యమవుతున్నాయి. డ్యూయల్ డిజిటల్ స్క్రీన్, 4-జోన్ క్లైమెట్ కంట్రోల్, ఏడీఏఎస్, పెట్రోల్, డీజిల్ తోపాటు హైబ్రిడ్ కూడా తయారు చేసింది.

### బీఎస్ఎన్ఎల్ బాస్‌గా రాబర్ట్

న్యూఢిల్లీ, జూలై 13: ప్రస్తుతం బీఎస్ఎన్ఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ పీకే పుర్వార్ పదవి కాలాన్ని కేంద్ర ప్రభుత్వం పొడగించలేదు. దీంతో టెలికం అధికారి రాబర్ట్ జే రవికి కంపెనీ సీఎండీగా అదనపు బాధ్యతలు అప్పగించింది. 2019 జూలైలో పదవీ బాధ్యతలు స్వీకరించిన పుర్వార్.. ఐదేండ్ల పాటు విధులు నిర్వహించినప్పటికీ, పదవీకాలాన్ని పొడిగించాలని దరఖాస్తు చేసుకున్నారు. కానీ కేంద్ర సర్కార్ ఆయన ప్రతిపాదనను తిరస్కరించింది. ఇండియన్ టెలికం సర్వీసు అధికారైన రవి.. టెలికం రంగంలో 34 ఏండ్లకు పైగా అనుభవం ఉన